# మనిషే— మమతా

ప్రకృతి కన్నె సింగారించిన మేఘవర్ణం పట్టుచీరకు వెండి జరీ అంచులాగా, మెరుపొకటి ధగాలుమని మెరిసి మాయమయింది. తదేకంగా మేఘాలవంక చూస్తున్న రవీంద్ర ఒక్కసారి కళ్ళు మిరుమిట్లు కొలిపినట్లయి, చటుక్కున దృష్టిని పక్కకు తిప్పాడు.

"అమ్మయ్య!" చిరునవ్వుతో నిట్టూర్చింది సంధ్య. "ఆ మెరుపు నాకోసమే మెరిసినట్టుంది. లేకపోతే మీ రిటు చూసేవారే కాదనుకుంటాను. అరగంటనుండీ ఇక్కడే కూర్చుని ఉన్నా ననయినా



మీకు గుర్తులేదు కదా? ఇంకేమన్నా ఆలోచనలు మిగిలిపోలేదు కదా?''

సాలోచనగా సంధ్య కళ్ళలోకి చూస్తున్న రవీంద్ర పెదవులపై నవ్వు పాకింది. కలలో నుండి మేల్కొన్నట్టు, ఒక్కసారి గట్టిగా ఊపిరి పీల్చుకుని, సంధ్య ముంగురులను మెలిపెట్టి వదిలాడు.

''కాదు, సంధ్యా! ఎప్పుడూ, దేనికీ నో రెత్తి గట్టిగా మాట్లాడనివాణ్ణి; అమ్మా నాన్నలతో ఎలా పోట్లాడి వచ్చానో! ఆ దృశ్యమంతా ఒక్కసారి కళ్ళముందు మెదులుతుంటే అలా ఆలోచనలో పడిపోయాను. ఎందుకు అంత గట్టిగా నోరు చేసుకున్నానా అనిపిస్తూంది. చేసిన పని ఎలాగూ చేస్తున్నానుగా? మెదలకుండా వచ్చేస్తే బాగుండే దనిపిస్తోంది'' అన్నాడు.

అందంగా, చిలిపిగా నొసలు చిట్లించింది సంధ్య. ''ఏదో సామెతచెప్పి నట్టుంది, మీ మాటలు వింటూంటే. ఫోనుచేసి, త్వరగా రమ్మన్న ముక్కను మాత్రం ఆదరాబాదరా చెప్పేసి ఊరుకున్నారు. అసలే ఆత్రుతగా ఉన్న నేను మరింత ఆదుర్దాగా పరుగెత్తుకొచ్చాను. వచ్చాక ఓ అర గంట, శిక్ష విధించినట్టుగా మూగనోము పట్టి కూర్చున్నారు. ఇప్పుడు హఠాత్తుగా ఈ ముక్కంటే నాకేం బోధ పడుతుంది, చెప్పండి? ఇంత సస్పెన్సా?''

''నీ అంత చిలిపిదనం నాకూ ఉంటే మెద డెందు కింత వేడెక్కుతుంది? ఈ అదృష్టం కోసమే కదా, అంతగా పోట్లాడింది?'' సంధ్య ముక్కు పట్టుకుని ఆడించి వదిలిపెట్టాడు రవి.

సంధ్య చెక్కులు ఎఱ్ఱబడ్డాయి. ఒక్కసారి సంభ్రమంతో రవివంక చూస్తూ, ''నాకేం అర్థం కావడం లేదు. అంతా వివరించి చెప్పండి. ఏమయింది? మీ రెందుకు పోట్లాడారు? వాళ్ళు ఒప్పుకోలేదా? చెప్ప రెందుకని?'' అంది.

''ఇలా కంగారు పడతావనే చెప్పలేదు. మరి, ఆవేశ పడకూడదు, అంతావిని.''

# మనిషి-మమతా

సంధ్య మాట్లాడలేదు. జిజ్ఞాసతో చూస్తూ ఊరుకుంది. రవి చెప్పుకుపోసాగాడు.

''మొదట సంగతంతా నెమ్మదిగానే చెప్పాను. అయితే మనమీద వాళ్ళకు ఉన్న అభిప్రాయాలకీ మనకీ ఎక్కడా పొత్తు కుదరడంలేదు. నేను ఓర్పుగా చెబుతున్నకొద్దీ రెచ్చిపోయారు మా నాన్నగారు. కులమింటి కోతినయినా చేసుకోవాలట! ఇంకో జాతి పిల్లని చేసుకుంటే జన్మే వృథా అన్నట్టు మాట్లాడారు. అమ్మ అటు నాన్నగారికీ, ఇటు నాకూ చెప్పలేక సతమత మయిందనుకో. అయినా తన భావాలు తనకీ లేకపోలేదులే. నువ్వు నా స్టూడెంటు వనగానే నేనేదో మోజులో పడిపోయాననీ, చదువుకున్న పిల్లలు గర్వంగా ఉంటారనీ తన కర్థమయింది. అవేవీ లేవనీ, తనకీ నచ్చేటట్టే ఉంటావనీ చెప్పాను. అంతకంటే వర్ణించి చెప్పడం నాకు చేత కాలేదు మరి.'' హాస్యంగా అని సంధ్యను దగ్గరకు తీసుకున్నాడు రవి. ''అదిగో, అలా మారిపోతావేం? ఆ మాటలన్నీ నే ననలేదుగా? అయితే చెప్పాను మరి. అందుకే భయం నాకు.''

జేవురించిన ముఖాన్ని కిందికి దించుకుంది సంధ్య. ఆమె చుబుకాన్ని పట్టుకుని మృదువుగా పైకి ఎత్తుతూ, ''అలా ఉండకు. ఏదన్నా మాట్లాడు'' అన్నాడు రవి.

ఒక్క అయిదు నిమిషాలు తనను తాను సంబాళించుకుంది సంధ్య. ''ఎందు కంతగా వాగ్యుద్ధం చేశారు, ఇంట్లో? వాళ్ళ మాటమీదనే చెయ్యచ్చుగా, ఏదన్నా? నిజమే. వాళ్ళన్నట్టు మీ కులంలో అయితే మంచి పిల్లలు దొరుకుతారు కూడాను.''

''పోనీలే. ఆ మంచి పిల్లలు నా కక్కర్లేదు. ఈ చెడ్డ పిల్లే కావాలి. నేను నీకు దూరమయి పోయేది నీకు ఇష్టం లేనప్పుడే—అన్న సంగతి తెలుసుగా? మరీ అంత ముక్కుమీద కోపం కూడదు సుమా, సంధ్యా! ఈ బంధానికి దూరంగా నువ్వు మాత్రం ఉండగలవా, చెప్పు?'' సంధ్య చుట్టూ ఉన్న చేతులను మరింత గట్టిగా బిగిస్తూ అన్నాడు రవి.

''అంత తేలికగా తీసుకోకండి. నన్ను చేసుకుని మీ వాళ్ళందరికీ దూరమయిపోతే, మీ మనసుకి మాత్రం బాధ కాదూ? మీరు కొద్దిగా త్యాగం చేస్తే చాలామందికి సంతోషం కలుగుతుంది. కాబట్టి......'' ఆపైన ఆమె మరి మాట్లాడటానికి వీలులేకపోయింది. రవి పెదాలు ఆమె వాక్ప్రవాహానికి అడ్డు పడ్డాయి.

కాస్సేపు ఉండి, అంత ఈదురు గాలిలోనూ సంధ్య నుదుటిమీద పట్టిన చెమటను రుమాలుతో తుడుస్తూ అన్నాడు రవి: ''త్యాగాలూ, భగ్నప్రేమా—ఇవేవీ నాకు చెప్పకు. అవన్నీ ఎక్కడో సినిమాల్లో చూస్తున్నవి. త్యాగమంటూ అర్థం లేని పనులుచేసి, జీవితాంతం మనిషొక దగ్గరా, మనసొక దగ్గరా అయిపోయి, కుళ్ళిపోవడం నాకు చేతగాని పని. నాకు కావలసింది నువ్వు. నీవు నా సహచరిగా ఉంటే ఆశించినవన్నీ లభించి నట్టు భావిస్తాను. నిన్నూ, మన పిల్లలనూ పోషించుకునే శక్తి నాకు ఉంది. ఎంతో ఆలోచించినమీదటే ఈ నిర్ణయానికి వచ్చాను. ఇప్పుడు నా మన సెంతో ప్రశాంతంగా ఉంది, సంధ్యా! నీ అభిజాత్యంతో దాన్ని కలచివేయకు.''

సంధ్య ఏమీ మాట్లాడలేదు. వ్యథతో కొన్ని క్షణాలు జ్వలించిన ఆమె హృదయానికి రవి పలుకులు మంచు తెమ్మెరలయినాయి.

''రేపే వచ్చి, మీ నాన్నగారితో నా నిర్ణయం చెబుతాను. ఈ వారంలోపల మన పెళ్ళి అయిపోవాలి. ఆ తరువాత నాలుగు ప్రదేశాలూ చూచి వచ్చి, ఇక్కడనుంచి ట్రాన్స్‌ఫర్ చేయించుకుందాము. కాదనవు కదూ?''

మూగవీణ అయిపోయి, మనసులో కోటి కోయిలలు గానం చేస్తూండగా రవి వక్షో వేదికపై ముఖాన్ని దాచుకుంది సంధ్య.

సంధ్యకు తల్లిలేదు. విధవ మేనత్త ఇంట్లో వండి పెడుతూ ఉంది. తండ్రి మాధవరావు గారు హైస్కూలు హెడ్‌మాస్టరు.

రవి నోటివెంట అతని నిర్ణయం విన్నాక, కూతురి ముఖంలోకి సాభిప్రాయంగా చూశా రాయన. ఆమెను అడగక్కర్లేకుండానే, సంధ్య చెక్కులలో పూచిన ఎర్ర మందారాలు ఆమె మనోగతాభిప్రాయాన్ని మాధవరావుగారికి విప్పి చెప్పాయి.

''తల్లిలేని పిల్ల. దాని సుఖంకంటే నాకు కావలసిం దేమీలేదు, నాయనా'' అంటూ గద్గద కంఠాన్ని సవరించుకున్నా రాయన.

'ఎన్ని జన్మాలకయినా ఇటువంటి తండ్రినే ప్రసాదించు, భగవాన్!' అనుకుంది సంధ్య మనసులో.

వారం రోజులలోపల సంధ్యా రవీంద్రుల

జాతీయ సమైక్యత ఫోటో—శ్రీమతి భామ (మద్రాసు-4)



**మనిషికి మమత సహజం. కాకపోతే మానవజాతి చరిత్ర వేరొక విధంగా లిఖితమై ఉండేది. ఆనుకూల్యం లేకపోతే పెంపొందకపోవచ్చు. ఇతరేతర శక్తుల ప్రభావం ఫలితంగా జనించేది కాకపోవడంచేత ఆలాంటి శక్తుల ప్రభావంవల్ల నశించనూ నశించదు. మనిషి మనినంతకాలమూ మమత ఆశ్రయించుకొనే ఉంటుందని మాత్రం తెలుసుకొనడం కష్టం.**

వివాహం జరిగిపోయింది. ఆ ఆదర్శ దంపతులను, సంఘంలోని పేరుపొందిన పెద్దలందరూ వచ్చి, ఆశీర్వదించి వెళ్ళారు.

మెళ్ళో సన్నటి గొలుసుతో, నాజూకైన చీరలతో మెరుపు తీవెలా తిరిగే సంధ్య రవికి అర్ధాంగి కాగానే ముద్దబంతిపూవు అయింది. అనుకున్న ప్రకారం నాలుగు ప్రదేశాలూ చూచి వచ్చి, అక్కడనుండి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు రవి. నవ దంపతు లిరువురూ కొత్త కాపురానికి సిద్ధపడి పయనమయ్యారు విజయవాడనుండి.

● ● ●

పంట చేలలో నడుమువంచి పని చేస్తున్న పల్లెపడుచులు ఒకసారి నిలబడి, కూత లేస్తూ పోతున్న రైలువంక ఒకసారి చూచి, తిరిగి తమ పనుల్లో మునిగిపోయారు. టెలిగ్రాఫ్ స్తంభాలపై బారులు తీరిఉన్న నీలి రెక్కల పిట్టలన్నీ ఒక్కసారి రివ్వుమని ఎగిరి చేలలో దూరిపోయాయి. చిన్న చిన్న నీటి మడుగుల్లో బూడిదరంగు మేఘాలూ, నీలాకాశమూ ప్రతిఫలిస్తున్నాయి అందంగా. దూరాన గంభీరంగా చూస్తున్న పర్వత శ్రేణులూ, వాటి ఎత్తును అధిగమించడానికి ప్రయత్నించే తాడితోపులూ, కొండల వెనుక నిద్రించబోతున్న రవిచుట్టూ అలుముకుంటున్న సంధ్యారాగం!

'ఇదీ భారతదేశ ప్రకృతి!' ఇంతసేపూ కిటికీలోనుంచి తల బయట పెట్టి, ఈ ప్రకృతి దృశ్యాల నన్నిటినీ పరికిస్తున్న రవి, మనసులో ఈ మాట నోసారి అనుకుని, పక్క బెర్తుమీదికి చూశాడు. నిశ్శబ్దంగా ఉంది ఆ మొదటి తరగతి కంపార్ట్‌మెంటు. నిశ్చింతగా బెర్తుపై నిద్రపోతున్నది సంధ్య.

నిద్రలో వడిలిన ముఖానికి అదొక రకం అందం వచ్చింది. నుదుటిపై సన్నగా చెదిరిన ఎర్రటి కుంకుమ బొట్టు. మెడలో పచ్చటి నగల మధ్య కొత్త అందంతో ధగ ధగలాడే మాంగల్యం. గాజులతో నిం[illegible] కనిపించే చేతిని నుదుటిపై సుతారంగా పెట్టు[illegible] నిద్రిస్తున్న సంధ్యను చూడగానే, తానింతసేపూ చూచిన ప్రకృతి సౌందర్యమంతా సంధ్యలోనే నిక్షిప్తమైనట్లనిపించింది రవికి.

'నిజమే. సంధ్య ప్రకృతి అయితే నేను పురుషుణ్ణి' అనుకుని నవ్వుకున్నాడు. అంతరాల్లో నుండి ఒక మమత వెల్లువ ప్రవహించింది. లేచి, సంధ్య పక్కన కూర్చుని విస్తృతమైన ఆమె కనురెప్పలపై మృదువుగా పెదవులతో తాకాడు.

ఆ మృదు స్పర్శకే సంధ్య కొంచెం కదిలింది. కాసేపు పోయాక కళ్ళు విప్పి చూసింది. పక్కనే కూర్చుని తనవంకే చూస్తున్న భర్తను చూచి సిగ్గుపడింది.

"ఎంతసేపటినుండీ కూర్చున్నా రలా?" అన్నది.

రవి చిన్నగా నవ్వి, "అప్పుడే లేచావెందుకు? నీవు మేలుకోకపోతే ఆ సుషుప్తి సౌందర్యాన్ని ఇంకా కొంతసేపు చూసేవాణ్ణి" అన్నాడు.

"ఇంగ్లీషు లెక్చరరుగారికి తెలుగు కవిత్వం వస్తున్నదే!" అన్నది సంధ్య చిలిపిగా పెదవి విరిచి.

"నిజం, సంధ్యా! ఇలా ప్రశాంతంగా కూర్చుని నీవంక చూస్తుంటే, భవిష్యత్తు అంతా ఒక వెలుగుబాటలాగా కళ్ళకు కడుతూంది" అన్నాడు రవి భార్యవంక పరిపూర్ణ తృప్తితో చూచి.

* * *

అదే నిజమయింది. సంధ్యా రవీంద్రుల వివాహం అయి అయిదేళ్ళయింది. వారి పసివాడు రాజుకు నాలుగవ ఏడు వచ్చింది. కొద్ది రోజుల్లో రాజుగాడు ఇంకో తమ్ముణ్ణో, చెల్లాయినో ఎత్తుకోబోతున్నాడు కూడాను.

ఎంత ఆనందంగా గడుపుతున్నా భార్యా భర్తలిద్దరి మనసుల్లో ఏదో లోటు! స్నేహితుల కుటుంబాలను చూచివచ్చిన రవి, ఇంటికి వచ్చాక దీర్ఘాలోచనలో పడిపోయేవాడు. తన మిత్రులంతా వారి తల్లితండ్రులతోనూ, తోబుట్టువులతోనూ కళకళలాడుతూ ఉండటం చూచిన అతని మనస్సులో కలకలం రేగేది. తనకూ ఉన్నారు తల్లీ, తండ్రీ, రక్తసంబంధికులూ. కానీ తానే స్వయంగా ఆ బంధాలన్నిటినీ తెంచుకుని వచ్చేశాడు. తక్కిన పిల్లలందరిలాగా రాజుకు వాళ్ళ నాన్నమ్మ వడిలోనూ, తాత బుజాలమీదా ఆడుకునే అదృష్టం లేదు. కష్టం వచ్చినా, సుఖం వచ్చినా తానూ, సంధ్యా ఒకరి నొకరు ఓదార్చుకోవలసిందే తప్ప, పెద్ద దిక్కంటూ ఎవరూ లేరు. 'అమ్మేగనక ఇక్కడుంటే ఈ ఇంటి కెంత సందడి వచ్చేది!' అనుకునేవాడు. ఈ విధమయిన ఆలోచనలతో మనసులో అశాంతి రగుల్కొ సాగింది.

ఒకనాడు అతని ఆలోచనా తీవ్రతను గమనించిన సంధ్య అడిగింది: "ఏమిటి, ఆలోచిస్తున్నారు?"

రవి చటుక్కున తెప్పరిల్లాడు. "ఏమీలేదు. అమ్మా, నాన్నా గుర్తుకు వస్తుంటే..."

సంధ్య నవ్వింది. "ఎక్కడో, అత్తారింటికి వచ్చిన పడుచు పిల్లలాగా ఉన్నారు మీ వరుస చూస్తుంటే! ఒకసారి వెళ్ళి కొద్ది రోజులు ఉండి రాకూడదూ? వాళ్ళెవరూ మన ఇంటికి రారు కదా? లేకపోతే నేను కూడా మీ వెంట వచ్చేదాన్నే! అందరినీ చూడాలని నాకు కూడా మనసు పుడుతున్నది" అన్నది.

"ఏ ముఖం పెట్టుకొని వెళ్ళను, సంధ్యా? పౌరుషపడి, బంధాలు తెంచుకుని వచ్చేశాను. వాళ్ళు రావాల్సిందే గానీ......వాళ్ళకి మాత్రం, కనీసం మా అమ్మకయినా ఉండకూడదూ? నేను పెద్ద కొడుకుని కూడాను" అన్నాడు రవి. దుఃఖంతో అతని గొంతుక జీరపోయింది.

అంత లెక్చరరూ పసివాడులా కనిపించాడు సంధ్య కంటికి. అతన్ని గుండె కదుముకుని, తల నిమురుతూ, "మరీ రాజుకంటే పసివాడిలా అయిపోకండి. మీ అమ్మగా రెంత బాధపడుతున్నారో మీరు వెళ్ళి చూశారా ఏమయినా? ఈ వేసంగి సెలవుల్లో వెళ్ళిరండి. తల్లితండ్రులకీ, పిల్లలకీ మధ్య పంతాలూ, పౌరుషాలూ కలకాలం ఉండిపోవు" అన్నది.

"వదినా! ఏం చేస్తున్నారు?" అంటూ సరాసరి లోపలికి వచ్చేస్తున్న ప్రభాకర్ గావుకేక విని, సర్దుకుంది సంధ్య. రవి పని చేస్తున్న కాలేజీలోనే డిమాన్‌స్ట్రేటరుగా చేరిన ప్రభాకర్ చలాకీ అయిన కుర్రవాడు. స్నేహరీత్యా వస్తూ, పోతూ ఉండటంవల్ల సంధ్యదగ్గర బాగా చనువయింది.

ప్రభాకర్ నోటివెంట "వదినా!" అనే పిలుపు విని కొంత తృప్తిపొందుతూ ఉంటుంది సంధ్య. తనకో మరిదీ, ఆడపడుచూ ఉన్నారని వినడమే కానీ, ఎప్పుడూ వాళ్ళను చూచి ఎరగదు. అత్తమామల ఫొటోలు చూసిందిగానీ, సాధారణంగా వాటిని బీరువానుండి పైకి తీయడు రవీంద్ర. కాబట్టి వాళ్ళూ అంతంత మాత్రంగానే గుర్తు. తన దిగులేమో తనదే కానీ, సంధ్య మనసు గురించి ఏనాడూ ఆలోచించడు రవి.

అత్త మామల దగ్గర మసులుకోవాలనీ, వారి కోడలుగా తన స్థానం నిలబెట్టుకోవాలనీ, సంధ్య మనసులో కూడా ఉంది, కాంక్షాపూరితమైన వేదన. తోటి ఆడవాళ్ళందరూ అత్తవారి గురించీ, పుట్టింటి గురించీ చెబుతూ ఉంటే ఆమె మనసంతా ఆ అనుభూతికోసం తపిస్తూ ఉండేది. ఒక్కొసారి భర్త పరధ్యానం చూసి, తనను చేసుకున్నందుకు విచారిస్తున్నాడేమో అని కూడా అపోహ పడటం జరుగుతుండేది. కానీ, ఆ మాట బయటికి అనేస్తే తన ఆలోచనలను ఎక్కడ లోకువ కట్టేస్తాడో అని చిన్నతనం.

ఇద్దరి వివాహం అందరిమాదిరిగానే అయిపోయి ఉంటే ఈ తపనా, కాంక్షా ఉండేవి కావేమో! కథ అంతా లోకం తీరులోనే నడిచి ఉండేది అప్పుడు. కానీ, మనుషులు దూరం

## డి. ప్రమీలాకుమారి

# సంక్రాంతి లక్ష్మి

కుడుము వేంకటరత్నం

**మంచు** తెర తెలి ముసుగు
తన సోరునకు వెలుగు,
పసిడి ధాన్యపు రాశి
పసుపు కుంకుమ ప్రోది

వోలె శోభిల్లగను
వచ్చె సంక్రాంతి యను
కొత్త డబుముసు తన
కోర్కె దీరెడు కతన!

భోగి మంటలు వేసి
భోగి పళ్ళను పోసి
స్వాగత మ్మిచ్చిరి,
పండుగులె చేసిరి.

వెల్ల వేసిన ఇండ్ల
తెలికాంతి నిగ్గులే
తేజరిల్లు చునుండె
తరుగని లడుగిడ నుండ.

వాకిళ్ళ కలియంపి
వేడుకగ బలె విరిసి
రంగవల్లులు తీర్చి
రంగు బంతులు కూర్చి

తళతళల వెలుగొందు
పలుసులు ధరియించి
పసిడి తోరణములను
పండు ముత్తయిదు వలె

కను విందు లొనరించు
సింహద్వారము ముందు
సంక్రాంతి కన్యకకు
స్వాగతమ్ము పతించి

పసిడి చిలికించేటి
పసుల సింగారించి
మావేల్పులని మ్రొక్కి
మంగళారతు లిడిరి.

చెరిగిపోనని తలపు
చెదిరిపోని వలపు
పూయించి రందరు
సంతోష మందిరి.

వన్నె చిన్నెలు కూర్చు
వెలుగు జిలుగుల ప్రోది
వచ్చింది సంక్రాంతి
**తెచ్చింది నవకాంతి.** *

# మనిషి-మమతా

కావడంతో మనసులు దగ్గరవడంకోసం ఆత్రుత అసహజమేమీ కాదు. మమత అనేది అప్పుడే మొదలవుతుందా?

"నే నింత ఉత్సాహపడుతూ వస్తే ఇద్దరూ అలా ఉన్నారేం?" నీళ్ళు కారిపోయాడు ప్రభాకర్. అతని హుషారు చూడగానే సంధ్యకు చైతన్యం కలిగింది.

"మీ అన్నయ్యగారు పుట్టింటిమీద బెంగ పెట్టుకున్నారోయ్, మరిదీ. ఓదారుస్తున్నాను. ఉండు, కాఫీ తెస్తాను" అంటూ లేవబోయింది. భార్యవంక చిరు కోపంతో చూశాడు రవి.

"కాఫీకి తొందరలేదు, వదినా. వంటింట్లో కొచ్చి అయినా తాగేస్తాగా? ముందీ కబురు వినే సెయ్యండి."

"ఏమిటోయ్, ఆ ఎక్సయిట్‌మెంట్?" వెనక్కు జారబడుతూ అడిగాడు రవి.

నిటారుగా నించుని ఆహ్వానం దంపతులకు అందిస్తూ పోజు పెట్టాడు ప్రభాకర్. "ఇందు మూలంగా నేను విన్నవించుకొనున దేమనగా, ఈ శతమర్కట సమానుడు బ్రహ్మచర్యానికి స్వస్తి చెప్పేస్తున్నాడు. వివాహము విజయవాడలో, వధూ గృహమున ఫలానా తేదీ, ఫలానా నక్షత్రమున, ఏదో లగ్నమున — రాత్రి ఒంటి గంటా సలభయి అయిదు నిమిషములకు జరుపుటకు పెద్దలు నిశ్చయించిరి. గాన, తాము ఏ తత్శుభముహూర్తమునకు బంధుమిత్ర సపరివారముగా వేంచేసి, మత్కృత చందన తాంబూలాదులను స్వీకరించి......"

శుభలేఖ అందుకుని టేబిల్‌మీది పుస్తకాల్లో దూరుస్తూ నవ్వేశాడు రవి, "కంగ్రాచ్యులేషన్స్" అంటూ.

సంధ్య కూడా నవ్వుతూ, "బాగా బ్రైహోర్ట్ చేశావుగానీ, అక్కడక్కడా తప్పులు వినపడుతున్నాయి. శుభ లేఖలు ఇవ్వడం దండగ కాదూ? ఇలా అందరి దగ్గరా అప్పజెప్పేస్తే ఎంత చవక!" అన్నది.

"నువ్వు పెళ్ళికొడుకు వయ్యావని అందరికీ పిలిపిస్తాడా, మన ప్రిన్సిపాల్?" తప్పించుకున్నాడు రవి.

బుర్ర గోక్కున్నాడు ప్రభాకర్. "అదేం లాభంలేదు. కనీసం వదిన అయినా రాకపోతే ఎలా?"

"సరేలే. అప్పటి సంగతి కదా? చూద్దాము." సంభాషణ ఆవిధంగా ఇంకోవైపు మళ్ళిపోయింది.

• • •

ఆవేళ రాత్రి, భోజనాలయ్యాక ఏవో పుస్తకాలు దిద్దుతూ కూర్చున్నాడు రవి. పనులన్నీ ముగించుకుని భర్త దగ్గరకు వచ్చి కూర్చుంది సంధ్య. కాస్సేపు పోయాక రవి పుస్తకాలు పక్కనపెట్టి, పెన్ను మూస్తూ, తలెత్తి భార్య ముఖంలోకి చూశాడు.

కొద్ది క్షణాలు ఊరుకుని, "నే నొక మాట చెప్పాలనుకుంటున్నాను. కాదనరు కదా?" అన్నది సంధ్య.

"ఏనాడయినా కాదన్నానా?"

"అలా అని నే నన్నానా?" నవ్వింది సంధ్య.

"సరే. ఇలా వాదించుకుంటూ కూర్చుందామా?"

"అది కాదండీ. నాకు నెలలు నిండిపోయాయి కదా? పురిటికి వచ్చేయమని మా నాన్నగారు వ్రాశారు కూడాను. అక్కడయితే మా అత్తన్నీ చూసుకుంటుంది. నాకు శ్రమ తప్పుతుంది. ఇప్పుడు వెళ్ళితే ప్రభాకర్ పెళ్ళీ చూసినట్టుంటుంది; మా నాన్నగారు కూడా సంతోషిస్తారు. అప్పుడే మా ఇంటికి వెళ్ళి రెండేళ్ళవుతూంది కదా?"

వింటూనే దిగాలు పడిపోయాడు రవి. "అయ్యో! ఇలాగని ముందుగా తెలిస్తే మాట ఇవ్వకపోయి ఉండేవాణ్నే. నువ్వు వెళ్ళకపోయినా, నీ నాన్నగారు వచ్చి చూసి వెళ్ళుతున్నారు కదా? నీ అత్తయ్యనే ఇక్కడికి పిలిపించుకోకూడదా, సంధ్యా?"

"మీరు మరీ చిన్న పిల్లాడయిపోతున్నారు. ఇంకో నెల రోజులు పోయాక మీకూ సెలవలే కదా? అప్పుడు మీరే అక్కడికి వచ్చేయవచ్చు. ఏమంటారు?"

చాలాసేపు సున్నితంగా వాదించి, ఎలాగో భర్తను ఒప్పించగలిగింది సంధ్య. అసలు ఆమె ఉద్దేశం వేరు. తాను కొన్నాళ్ళు పుట్టింట్లో ఉంటే, ఈమధ్యలో రవి వెళ్ళి తన తల్లి తండ్రులను చూసి రావచ్చునని ఆమె అభిప్రాయం. తల్లితండ్రులవద్ద తన ఓటమిని ఒప్పుకోవడానికి భర్త పౌరుష పడుతున్నా డన్న సంగతి సంధ్య గ్రహించకపోలేదు.

• • •

"వచ్చి బండి దింట్లో దిగగానే మొదట వచ్చి తీసుకెళ్ళేది మిమ్మల్నే, వదినా. సిద్ధంగా ఉండండి. మీరుకూడానండి." కంపార్ట్‌మెంటులోనుండే హడావుడిగా మాట్లాడేస్తున్నాడు ప్రభాకర్. పెళ్ళి పందిరిలా ఉంది విజయవాడ ప్లాట్‌ఫారమ్.

కూతురిని రిసీవ్ చేసుకోవడానికి వచ్చిన మాధవరావుగారు నవ్వారు, "అలాగే నబ్బాయ్" అంటూ.

అంతలా ప్రభాకర్ ధాంధూంచేసిన పెళ్ళి రోజు రానే వచ్చింది. మగ పెళ్ళివారి తరపు ఆడవాళ్ళతోకలిసి పెళ్ళి పందిట్లో అడుగుపెట్టింది సంధ్య. జరగవలసిన పనులన్నీ హడావుడిగా జరిగిపోతున్నాయి.

"ఎలా ఉంది, వదినా, సెలక్షన్?"

"చక్కని చుక్కను ఎన్నుకున్నావోయ్, మరిదీ." అభినందించింది సంధ్య.

సహజంగా మగవాళ్ళందరూ ఒకచోట కూడి నప్పుడు ఒకరి గురించి ఒకరంత పట్టించుకోరు. నలుగురూ పరిచయమైనప్పుడు ఏవో రాజకీయాలూ, లోకంతీరూ, ఆఫీసు విషయాలూ సాధారణంగా దొర్లిపోతాయి. కానీ వనితా జనత అలా కాదు. ప్రతి విషయం వాళ్ళకే కావాలి. తమకు కుతూహలంగా కనుపించిన ప్రత్యణువు గురించీ పుట్టుపూర్వోత్తరాలన్నీ ఆరా తీయనిదే వాళ్ళకు తోచదు.

నిండుగా, ఠీవిగా పందిట్లో కలివిడిగా తిరిగే సంధ్య అందరి దృష్టినీ ఆకట్టుకుంది. పైగా పెళ్ళికొడుకు "వదినా, వదినా!" అంటూ తిరిగేస్తున్నాడు కూడాను.

తలంబ్రాలు పోసేదగ్గర, ఉంగరాలు తీసే దగ్గర, నాగవల్లి వద్ద సంధ్య చనువుగా పెళ్ళి కూతురి తరఫున బయలుదేరి, ప్రభాకర్‌ను కవ్వించ సాగింది. ఇది, చూస్తూ ఉన్న పెళ్ళి కూతురి తల్లి లక్ష్మమ్మకు ముచ్చట గొలిపింది.

కుతూహలాన్ని ఆపుకోలేక ప్రభాకర్ చెల్లెలు శ్యామలను పక్కకు పిలిచి, "ఎవరమ్మా తను? నీకేమవుతుంది?" అని అడిగింది మెల్లగా.

"అబ్బే. మాకు బంధుత్వ మేమీ లేదండీ. మా అన్నయ్య ద్వారా మాకు స్నేహం కలిసింది. అన్నయ్య పనిచేసే కాలేజీలోని లెక్చరరు రవీంద్ర గారి భార్య." శ్యామల నవ్వుతూ చెప్పింది.

"లెక్చరర్ రవీంద్ర భార్యా?" లక్ష్మమ్మ ముఖంలో రంగులు మారిపోయాయి. "పుట్టిల్లు ఏ ఊరో?" సందేహం వ్యక్తపరిచింది.

"ఈ ఊరేనట. హెడ్మాస్టరు మాధవరావు గారనీ......మీకు తెలుసా?"


ఉన్న ఒక్క సందేహం కూడా తీరిపోయింది. తెప్పరిల్లుతూ అంది లక్ష్మమ్మ: "తెలిసినట్టే ఉంది చూస్తుంటే. పిలిచి కనుక్కుంటాను."

శ్యామల వెళ్ళిపోగానే లక్ష్మమ్మ అలా స్తంభానికి చేరబడి ఉండిపోయింది. తనలోని శక్తి నంతటినీ ఎవరో లాగేసుకున్నట్లు అనిపించిందామెకు. చివరికెలాగో తేరుకుని పనులన్నీ అన్యమనస్కంగా చేస్తున్నా, ఆమె మెదడు మాత్రం పని చేయసాగింది.

'ఎంత సలక్షణంగా ఉంది! తానూహించిన నైలాన్లూ, లిప్‌స్టిక్కులూ లేవే! పట్టుచీర కట్టుకుని ఒంటినిండా నగలతో కళగా ఉంది.' తన నుండి కొడుకును దూరం చేసిన పిల్ల ఈమే నన్న భావం ఆమెలో కసిని రేకెత్తిస్తున్నా—సంధ్య ముఖంలోని పవిత్రతా, సౌమ్యతా ఆ కసినంతటినీ మాయంచేసి ఆ స్థానంలో ఏదో తెలియని ఆత్మీయతా భావాన్ని నెలకొల్ప సాగాయి.

తను కాదన్న కోడలు ఈనాడు తన ఎదటే ఠీవిగా తిరుగుతూంది. తానే అత్తగారని తెలిస్తే? 'కొంత పరీక్షించి చూడాలి' అనుకుంది లక్ష్మమ్మ.

సంధ్య కొంగు పట్టుకు తిరుగుతున్న రాజును చూడగానే ఆమెలోని తల్లి మనసు ఒక్కసారి ఉప్పొంగింది. 'రవి నాలుగేళ్ళప్పుడు ఇలాగే కదూ



దంపతులు

ఫోటో—వి. కూచిమంచి (బొంబాయి-19)

ఉండేవాడు? రవి నోట్లోనుంచి ఊడి పడ్డట్టున్నాడు కుర్ర వాగన్న!'

ఉబలాటం ఆపుకోలేక రాజా నోరారి ఎత్తుకొని ముద్దులు కురిపించింది. "నేను మీ నాన్నమ్మనిరా" అని చెప్పాలనిపించిం దావిడకు. ఇదంతా మనసులోనే తర్కించుకుంటూంది గానీ, భర్తదగ్గర కూడా కొంచెమయినా బయట పడ లేదు. గుంభనగా ఊరుకుంది. పెద్దకొడుకు రాకపోయినా కోడలు వచ్చి ఆడపడుచు పెళ్ళి జరిపించినట్టు భావించుకోగానే ఆమె మనసుకు కొంత ఉపశమనం కలిగింది.

వివాహ కార్యం పూర్తయిపోయింది. ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. అందరిలాగానే సంధ్య కూడా తండ్రి ఇంటికి వెళ్ళిపోయింది. సంధ్యను ఎలానయినా కలుసుకుని తీరాలన్న ఆత్రుత మాత్రం లక్ష్మమ్మకు తీరలేదు. ఏదో విధంగా, ఒక నెపం పెట్టుకుని సంధ్య ఇంటికి వెళ్ళాలి.

* * *

మారాం చేస్తున్న కొడుకును బుజ్జగించి ముస్తాబు చేస్తున్న సంధ్య ఎవరో వచ్చినట్లయి వెనక్కు తిరిగి చూసింది. వెంటనే చటుక్కున లేస్తూ ఆనవాలు పట్టింది. ప్రభాకర్ అత్తగారు.

"రండి, పిన్నిగారూ" అంటూ సాదరంగా ఆహ్వానించి కూర్చోబెట్టింది. ఆ సంబోధనకు లక్ష్మమ్మ మనస్సు చివుక్కుమంది.

తెచ్చిన బిస్కట్ పాకెట్ను రాజా చేతుల్లో పెట్టి వాణ్ణి దగ్గరకు తీసుకుంటూ, "ఇక్కడే తెలిసిన వాళ్ళింటికి వచ్చాము. ఇలా చూసి పోదామని వచ్చానమ్మాయ్. ఏం చేస్తున్నావురా, మనమడా? ఈ బామ్మ గుర్తుందిరా నీకూ?" అన్నది.

# మనిషి - మమతా

బిస్కట్లు దొరకగానే రాజు బుద్ధిగానే బామ్మ ఒళ్ళో కూర్చున్నాడు. సంధ్య నవ్వుతూ "అయితే నాకు అత్తగారయ్యా రన్నమాట. వీరా, వెధవాయ్! అప్పుడే నాన్నమ్మచేత డబ్బు ఖర్చు పెట్టిస్తున్నావా?" అన్నది.

సంధ్య మేనత్త లోపలనుండి వస్తూ కొత్తావిడను చూచి, ప్రశ్నార్థకంగా నిలబడిపోయింది.

"వీరు ప్రభాకర్ అత్తగారు. మొన్న వెళ్ళాను చూడూ—వీళ్ళింటికే నన్నమాట. ఈమె మా మేనత్తండీ. మా అమ్మ పోయిన తరువాత మా ఇంటికి పెద్ద దిక్కు మా అత్తే. మాట్లాడుతూండండి. ఇప్పుడే వస్తాను" అంటూ లోపలికి వెళ్ళి, కాఫీ తీసుకువచ్చింది సంధ్య.

మెల్లిగా మాటలు కలిశాయి. అవీ ఇవీ చెప్పుకుంటూ, అసలు విషయంలోకి దిగింది లక్ష్మమ్మ.

"మీ అత్తవారే ఊరమ్మాయీ?"

ఈ ప్రశ్నకు సంధ్య కొంచెం కలవరపడింది. తడబడుతూ అంది: "విశాఖపట్నమండీ."

"అత్తగారు బాగానే చూసుకుంటుందా, అమ్మా?" లక్ష్మమ్మ లౌక్యంగా ప్రశ్నిస్తోంది.

గొంతు సవరించుకుంది సంధ్య. "ఏం చెప్పమంటారు? నాకా అదృష్టం లేదు. తల్లి తండ్రుల ఇష్టానికి వ్యతిరేకంగా నన్ను చేసుకున్నారీయన. వాళ్ళ ఇష్ట ప్రకారమే నడవమని నేను చెప్పినా వినా్నరు కాదు. ఆనాటినుంచీ వాళ్ళకు దూరమయిపోయాము. ఇప్పటికీ ఆయన వాళ్ళను గుర్తుకు తెచ్చుకుని విచారిస్తుంటారు. ఒకసారి వెళ్ళిరమ్మని చెబుతుంటాను నేను. అయినా ఇప్పుడు వెళ్ళితే వాళ్ళెక్కడ చిన్న చూపు చూస్తారోనని ఆయన భయం. నాకూ ఉంటుంది అత్త మామలను చూడాలనీ, వాళ్ళ సేవ చేసుకోవాలనీ. కానీ మా అదృష్టం ఇలా ఉంది. ఏం చెయ్యమంటారు, చెప్పండి?"

సంధ్య బరువుగా నిట్టూర్చితే, లక్ష్మమ్మ తేలికగా ఊపిరి పీల్చుకుంది. 'తానే అత్తగారని తెలిస్తే ఈ మంచితనం నిలుస్తుందా?' అన్న సందేహం మనసులో మెదిలినా, సంధ్య మాటలు ఆమెకు శాంతిని ప్రసాదించాయి.

"విచారించకమ్మాయీ! నీ మనసు మంచిదయినప్పుడు మీరూ, వీరూ కలవకుండా ఉంటారా?" అని ఓదార్చింది.


"ఏరా, బాబూ? మా ఇంటి కొచ్చేస్తావా?" రక్తసంబంధంలో ఉన్న శక్తి అటువంటిది కాబోలు! రాజు అంగీకార సూచకంగా తల ఊపాడు.

"రాజులాంటి కొడుకును కన్నావమ్మాయీ. వీణ్ణి నాతో తీసికెళతాను. కాస్సేపు ఉంచి పంపించేస్తాను. అప్పుడప్పుడు వస్తూ ఉండండి." వెళ్ళివస్తానని చెప్పి సంధ్య జవాబు ఆశించకుండానే రాజును ఎత్తుకొని వెళ్ళిపోయింది లక్ష్మమ్మ.

* * *

రోజులు గడుస్తున్నకొద్దీ సంధ్యకూ, లక్ష్మమ్మకూమధ్య ఆత్మీయత బాగా అధికమయింది. రాజు మాత్రం రోజులకొలదీ లక్ష్మమ్మ దగ్గరే ఉండిపోతున్నాడు. వాడి ఆలనా, పాలనా స్వయంగా చూసుకుంటుంది ఆవిడ.

ఈ విషయాలన్నీ భర్తకు వ్రాస్తూ, "సొంత అత్తగారిని నేను చూడలేదు గానీ, ఈ అత్తగారు మాత్రం ఎంతో ఆప్యాయంగా చూసుకుంటున్నారు నన్ను. రాజాగాడు ఒక్క క్షణమయినా విడిచి ఉండడు ఆవిడను. ఆమె ఎప్పుడూ మీ యోగక్షేమాలను గూర్చి కూడా విచారిస్తూంటారు" అంటూ ముగించింది



సంధ్య.

"మీ అత్తగారి ధ్యాసలోపడి నన్ను పూర్తిగా విస్మరిస్తున్నావు. ఉత్తరం నిండా ఆ సంగతులేనా? అన్యాయం!" రవి వద్దనుండి రిపోర్టు వచ్చింది. చదివి నవ్వుకుంది సంధ్య.

ఒకనాడు—భర్తకు అన్నం వడ్డించి, పక్కనే వెండి గిన్నెలో రాజాకు అన్నం తినిపిస్తూ, "మన రవికి కూడా కొడుకు పుడితే ఇంతవాడయి ఉంటాడు కదండీ?" అన్నది లక్ష్మమ్మ నెమ్మదిగా.

"పుడితే—ఏమో ఎవరికి తెలుసు? వాడికి లేదు గానీ తలితండ్రులన్న అభిమానం, నీకు మాత్రం ఉండబట్టదు. ఏదీ ఆ చారు పొయ్యి." విసుక్కున్నా రాయన.

లక్ష్మమ్మ కంఠం గద్గదమయింది. "చిన్న వాళ్ళు ఏదో అలిగారని వాళ్ళతో సమానంగా మనం పంతం పట్టుకు కూర్చుంటామండీ? వాడి కడుపున ఓ కాయ కాస్తే మనది కాదా, ఆ సంతోషం? మీ కోపతాపాలకి భయపడే, వాడు రావడం మానుకున్నాడో, ఏమో?"

"ఎప్పుడో, ఏదో అన్నానని దాన్ని పట్టుకు వేళ్ళాడతానుటే? కాలం మారింది. దానితో పాటు వాడి బుద్ధి కూడా మారి, అమ్మా నాన్నా అంటూ వస్తే పొమ్మంటామా? ఏడుస్తావెందుకూ?" భార్య కన్నీరు చూచి మనసు బాధపడినా, బెట్టు చెడగొట్టుకోకుండా అన్నారాయన.

లక్ష్మమ్మకు ఆనందంతో కళ్ళనీళ్ళు వచ్చాయి. "మీ తాతగారి మనసు కరిగిందిరా, బాబూ!" అంటూ రాజు బుగ్గలపై ముద్దుల జల్లు కురిపించింది.

"తాతయ్య" అని రాజుచేత పిలిపించుకోవడం అలవాటు కాబట్టి, లక్ష్మమ్మ మాటలో ఉన్న అంతరార్థం ఏమీ స్ఫురించలేదు ఆయనకు.

* * *

ఒకనాటి గోధూళివేళ రాజాకు చెల్లాయి పుట్టింది. ఈ వార్త వినగానే లక్ష్మమ్మ పడుతూ లేస్తూ వచ్చేసింది.

"ఏమమ్మాయ్, అబ్బాయికి వైరిచ్చారా?"

వడిలిన గులాబీలా పడుకుని ఉంది సంధ్య. పక్కలో ప్రశాంతంగా నిద్రపోతూంది రబ్బరు బొమ్మలాంటి చిన్న పాప.

"ఆఁ. ఇచ్చా రత్తయ్యా! పరీక్షలు రెండు మూడు రోజుల్లో పూర్తవుతాయి. సెలవ లివ్వగానే వస్తారనుకుంటాను." నీరసంగా నవ్వి, జవాబిచ్చింది సంధ్య.

సంధ్యకు కావలసిన ఏర్పాట్లు చూడటంలో లక్ష్మమ్మే కల్పించుకుంటూంది. ఇంటికి పెద్ద కోడలు. వంశోద్ధారకుడి తరువాత, లక్ష్మీదేవి లాంటి ఆడపిల్లను కన్నది! ఆమె సంతోషానికి అవధులు లేవు.

కొడుకును చూడాలనే కాంక్ష కూడా ఆవిడలో అధికమయిపోయింది. తమతో పోట్లాడి వెళ్ళిపోయినవాడు ఇద్దరు పిల్లల తండ్రిగా తమ కళ్ళ ఎదుట నిలుస్తున్నాడు. అయిదేళ్ళకిందట తెగిపోయిన తీగ ఈనాడు అతుక్కుంటూంది. ఇక తనకే విచారమూ లేదు.

"మధ్యాహ్నం ఎక్స్‌ప్రెస్‌లో ఆయనొస్తున్నా రత్తయ్యా. ఉత్తరం వచ్చింది. ఒరేయ్, రాజా! ఆడుకోవడాని కెళ్ళిపోకు. మీ నాన్నగారొస్తున్నారు. మీరు కూడా ఉండండి. మిమ్మల్ని చూస్తే ఆయ నెంతో సంతోషిస్తారు కూడాను."

లక్ష్మమ్మకు కాళ్ళు నిలవడంలేదు. తత్తరపాటు అధికమయిపోయింది. తనను చూడగానే ఏమనుకుంటాడో, వాడు! ఒకచోట కూర్చుని తనను తాను సంబాళించుకోవడానికి ప్రయత్నించ సాగిం దావిడ.

మధ్యాహ్నం రెండు గంటలయింది. రిక్షావాడు హోల్డాలు, సూట్‌కేసు తెచ్చి లోపల పెట్టాడు. బూట్లు టక టక లాడించుకుంటూ లోపల అడుగుపెట్టిన రవి కాళ్ళను చుట్టేశాడు రాజా—"నాన్నా రొచ్చారోయ్" అంటూ.

"కులాసాయేనా, నాయనా? ప్రయాణం ఎలా సాగిందో? ఎండ నిప్పులు చెరుగుతూంది. స్నానం చేద్దువుగాని." సంధ్య మేనత్త రవిని పలకరించి కావలసిన ఏర్పాట్లు చేయడానికి లోపలికి వెళ్ళిపోయింది.

బూట్లు విప్పి, రాజా నెత్తుకుని సంధ్య ఉన్న గదిలోకి అడుగుపెట్టాడు రవి.

"రాజా, చెల్లా యెలా ఉందిరా?" రాజును అడుగుతూ, "సంధ్యా! పాప...." అంటూ తలెత్తి సంధ్యవైపు చూసిన రవికి నోట్లో మాట నోట్లోనే ఉండిపోయింది.

సంధ్య చిరునవ్వు నవ్వుతూ, "అలా నిర్ఘాంతపోతా రేమిటండీ? నేను ఉత్తరాల్లో వ్రాస్తూండేదాన్ని కదూ, అత్తగారని?...." అంది.

"ఏం, కొత్తగా కనిపిస్తున్నా నేమిట్రా? అలా నిలబడిపోయా వేమిటి? నీకంటే కోడలు నయంరా, నాన్నా!"

రవి కళ్ళల్లో నీళ్ళు నిండిపోయాయి. "అమ్మా, నువ్వేనా? కలకాదు గదా?" అన్నాడు గొంతు పెగుల్చుకుంటూ.

"నయమే. కల కాదని చెప్పమ్మాయ్ నువ్వయినా?" లక్ష్మమ్మ నవ్వుతూ మాట్లాడుతున్నా, సంధ్యకు నమ్మకం కలగడంలేదు.

"మీరు.....నిజంగా...."

"ఇది మరీ బావుంది. నీ కా సందేహం అక్కర్లేదమ్మాయ్. నేను నీ సొంత అత్తగారినే. నీభర్త నా పెద్దకొడుకు. తెలిసిందా? మీ నాన్నగారికి ఈ మధ్యనే ఇక్కడికి ట్రాన్స్‌ఫరయిందిరా, రవీ! పద, స్నానంచేసి ఏదో ఫలహారం చేద్దుగాని. ఆ తరువాత మన ఇంటికి వెళదాము. కోడలి స్నానం అయిపోయాక అందరూ అక్కడకే వస్తారు లెండు."

కొడుకుకూ, కోడలికీ తేరుకోవడానికి అవకాశం ఇచ్చి, ఆవిడ లేచి లోపలికి వెళ్ళిపోయింది.

సంధ్య ఆనందాశ్చర్యాలు నిండిన ముఖంతో అయోమయంగా భర్త వంక చూసింది. "ఏమండీ......"

రవి బాగా తేరుకుని వాస్తవంలోకి వచ్చాడు.

"అత్తగారిని మెప్పించి మంచి చేసుకున్నావా, సంధ్యా? మనుషులుగా పుట్టాము కాబట్టి, ఏవేవో అనుకుంటాము. దూరమయిపోవడం, విచారించడం, పంతాలూ, ఆచారాలూ ఇవన్నీ మిథ్యా జనితాలే. మనుషుల మనసుల్లో ఉన్న మమత ఒక్కటే వీటన్నిటినీ అధిగమిస్తుంది. అప్పుడే అది ఆదర్శమవుతుంది. అంతేకదూ?" అటూ ఇటూ చూచి, సంధ్య పెదవులను చుంబన రాగరంజితం చేస్తూ అన్నాడు రవి. ★

# సంక్రాంతివేళ

## వి. ఎస్. బాబు

హేమంత సీమంతిని మంజుల స్నిగ్ధ
వనసీమ కుసుమ సంపదల వెలసె
హరిదాసు మధురాగ ఝరి దిక్కులకు సాగి
ప్రాక్తీరమున పొంగి ప్రభల నెగసె
తుహిన బిందుశ్రేణి మహిని ముక్తాహార
ములవోలె మదయు కాంతులను మెరసె
జవరాలి కొనవ్రేలి చివురాకులను మెలి
రంగవల్లులు కుటీరముల విరిసె
ప్రతి మనమ్మున సంతోష మతిశయించి
చల్ల చల్లని నవ్వుల జల్లు కురిసె

ముగ్ధ సంక్రాంతి లక్ష్మికి మురిసె మార
ధాన్యరాశులు బంగారు దారి పోసె

విచ్చెను పూబంతులు గో
ర్వెచ్చని తలపులకు కలగి విరహిజనమ్ముల్
పుచ్చెను కాలము సంతట
రెచ్చెను వడకించు చలులు రెండింతలుగా

భోగిమంటల ధాటికి వేగలేక
చలి యువాలిని కౌగలించగను పోయె
చలికి వెరచిన జవరాండ్రు కలత చెంది
పతుల కౌగిళ్ళ జేరగ పరుగులిడిరి ●